

జగనన్న పాలనలో ఇంటింటికీ సంక్షేమం
జగనన్న పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందాయని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. - 8లో



పేదలకు మేలు చేసేలా మేనిఫెస్టో
పేదల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో రూపొందించారని డిప్యూటీ సీఎం తెలిపారు. - 8లో



జగనన్నతోనే నవరత్న వెలుగులు
జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు భారీగా వైఎస్సార్‌సీపీలో సోమవారం చేరారు. - 8లో

న్యూస్‌రీల్

ఎన్నికల ఏర్పాట్లపై వివరణ



అబ్జర్వర్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లను జనరల్ అబ్జర్వర్ షాధిక్ అలంను కలిసి జేసీ శ్రీనివాసులు వివరించారు.సోమవారం చిత్తూరు ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో జనరల్ అబ్జర్వర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లాలోని పోలింగ్ ఏర్పాట్లపై చర్చించారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం



మాట్లాడుతున్న శ్రీనాథరెడ్డి, అనీషారెడ్డి

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమైందని వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనాథరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనీషారెడ్డి, శ్రీనాథరెడ్డి మాట్లాడారు. సచివాలయ వ్యవస్థ ప్రజలకు ఎంతగానో సేవలు అందిస్తోందన్నారు.ఇలాంటి సేవలను చూసే వైఎస్సార్‌సీపీలో చేరామని వెల్లడించారు. అనీషారెడ్డి మాట్లాడుతూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఉన్న ప్రజాదరణ చూసి ఆయన వద్ద రాజకీయాలు నేర్చుకోవాలని కోరిక ఉండేదన్నారు. ఇప్పటికి పరిస్థితులు కలిసి వచ్చాయని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఎవరూ అమలు చేయలేరని స్పష్టం చేశారు. నవరత్నాలతో ప్రజల జీవనరేఖలు మార్చివేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు.

జిల్లాలో 1,771 పోలింగ్ పార్టీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు 1,771 పోలింగ్ పార్టీలను ఏర్పాటు చేశారు. నగరి నియోజకవర్గంలోని పుత్తూరు, వడమాల మండలాలకు తిరుపతి జిల్లా అధికారులు పోలింగ్ పార్టీలను నియమించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.పోలింగ్ రోజున పోలింగ్ పార్టీలు కేటాయించిన విధులను నిర్వహించనున్నట్లు తెలిపారు.

వేసవి నేపథ్యంలో కార్మికులు అప్రమత్తం

చిత్తూరు కార్పొరేషన్: వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని కార్మికులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కార్మికశాఖాధికారి ఓంకార్‌రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ మేరకు కార్మికుల రక్షణకు యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే విపత్తుల నివారణ సంస్థ హెచ్చరికలకు అనుగుణంగా రాష్ట్ర కార్మిక కమిషనర్ శేషగిరిబాబు ఆదేశాలు జారీ చేశారన్నారు. కర్మాగారాలు, దుకాణాలు, సంస్థల్లో పనిచేసేవారు, భవన నిర్మాణ కార్మికులు, వలస కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇదివరకే పలు సూచనలు చేసినట్లు వివరించారు. . కార్మికులు పనిగంటల్లో మార్పు చేయాలన్నారు. పని ప్రాంతంలో చల్లని తాగునీరు, నీడ వసతి కల్పించాలని కోరారు. వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకొని ఓఆర్ఎస్ ప్యాకెట్స్, ఐవీ ఫ్లూయిడ్స్, అత్యవసర మందులను సమకూర్చుకోవాలని చెప్పారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 వరకు బహిరంగ కార్మికుల పనివేళలు మార్పు చేయాలని, డీహైడ్రేషన్ నివారణ మార్గాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

పూతలపట్టు: సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. సోమవారం పూతలపట్టు మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో వారి ఓటుహక్కును వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ సుదర్శనప్రసాద్ పాల్గొన్నారు.

ఆ మారణహోమం చల్లా వ్యూహం



పుంగనూరులో విధ్వంసం సృష్టిస్తున్న టీడీపీ గూండాలు (ఫైల్)

ప్రజల ధన..మాన..ప్రాణాలంటే పచ్చమూకలకు లెక్కలేదు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేసే పోలీసులంటే గౌరవం లేదు. ప్రశాంత పుంగనూరును వల్లకాడుగా మార్చేయాలి. ప్రభుత్వంపై బురదజల్లాలి. ఇదే లక్ష్యంతో గత ఏడాది ఆగస్టు 2వ తేదీన అప్పటి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి.. ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి కుట్రకు తెగబడ్డారు. చంద్రబాబు పర్యటనలో అల్లర్లు సృష్టించేందుకు పథకం రచించారు. పోలీసుల ఉసురు తీయడమే లక్ష్యంగా దాడులకు ప్లాన్ వేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై నింద మోపేందుకు దారుణ మారణహోమానికి తెరతీశారు. అప్పటి ఘటనపై విచారణ చేపట్టిన పోలీసు అధికారులే లోగుట్టు తెలుసుకుని దిగ్భ్రాంతి చెందారు.

- పుంగనూరును వల్లకాడు చేసేందుకు కుట్ర
- బాబు పర్యటనను అడ్డుపెట్టుకుని అల్లర్లకు యత్నం
- పోలీసులను చంపి.. కాల్పులకు పురిగొల్పేలా ప్లాన్
- ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా దాడులు
- ప్రాణాలకు తెగించి.. రక్తం చిందించిన ఖాకీలు
- అప్పటి ఎస్పీ విచక్షణతో బెడిసికొట్టిన టీడీపీ నేతల పన్నాగం



రక్తమోడుతున్న సహచరుడిని తీసుకువస్తున్న పోలీసులు

పుంగనూరు : జిల్లాలోని పుంగనూరులో గత ఏడాది ఆగస్టు 4వ తేదీన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పర్యటనలో మారణహోమం సృష్టించేందుకు ఆ పార్టీ నేతలు ప్రణాళికలు రూపొందించారు. కనీసం ఇద్దరు పోలీసులనైనా చంపాలని దుర్మార్గపు ఆలోచన చేశారు. బాబు పర్యటనకు రెండు రోజుల ముందే ఈ ప్లాన్ రూపొందించారు. పోలీసులపై దాడులకు తెగబడి అల్లర్లు సృష్టించిన ఘటనలో అప్పటి టీడీపీ పుంగనూరు ఇన్‌చార్జి చల్లా బాబు అలియాస్ చల్లా రామచంద్రారెడ్డి గత ఏడాది ఆగస్టు 2వ తేదీన రొంపిచెర్లలో పార్టీ ప్రధాన వ్యక్తులతో రూపొందించిన పథకాన్ని ఆయన వ్యక్తిగత కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి పూసగుచ్చినట్లు పోలీసులకు చెప్పాడు. ఇది విన్న పోలీసులు కేవలం ఉనికిని కాపాడుకునేందుకు ఇలాంటి క్షుద్ర రాజకీయాలకు పాల్పడతారా అని షాక్‌కు గురయ్యారు.



పుంగనూరు అల్లర్లలో కన్ను కోల్పోయిన పోలీస్ (ఫైల్)



చల్లా గ్యాంగ్ దాడిలో తీవ్రంగా గాయపడిన పోలీస్ అధికారులు (ఫైల్)

ప్లాన్- ఏ..

పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి జనాదరణ పెరిగిపోతుండడంతో చల్లా బాబు రగిలిపోయారు. ఇదే పుంగనూరులో పెద్దిరెడ్డిని జీరో చేయాలని, అదే సమయంలో రాష్ట్రం మొత్తం పుంగనూరువైపు చూసేలా మారణహోమం సృష్టించాలని సంకల్పించుకున్నారు. చంద్రబాబు నాయుడు పర్యటన ర్యూట్ మ్యాప్‌లో పుంగనూరును చేర్చేందుకు పార్టీ శ్రేణులు పట్టుపట్టాలని నిర్ణయించారు. పోలీసులు దీనికి కచ్చితంగా అంగీకరించరని, ఇదే అదనుగా దాడులకు పాల్పడాలని నేతలు, కార్యకర్తలకు చల్లా బాబు దిశానిర్దేశం చేశారు. అందులో భాగంగా అప్పటికే కృష్ణదేవరాయ కూడలి వద్ద సిద్ధం చేసుకున్న రాళ్లు, మద్యం బాటిళ్లు, బీరు సీసాలు, బాంబులను పోలీసులను లక్ష్యంగా చేసుకుని విసరాలి. మొత్తం 30 నిముషాల పాటు ఈ రాళ్ల దాడి చేయడానికి వస్తువులను ఉంచారు. తొలి మూడు నిముషాల్లో చెప్పులు, వాటర్ బాటిళ్లు విసిరితే పోలీసులు తేలిగ్గా తీసుకుంటారు. అనంతరం పోలీసుల ఊహకు అందకుండా రాళ్లు, బాంబులు, మద్యం బాటిళ్లతో పది నిముషాలు దాడులు చేయాలని, ఇందులో ఒకరిద్దరు పోలీసులు చనిపోయినా పర్లేదని ఆదేశించారు. ఇదే కనుక జరిగితే వెంటనే పోలీసులు కాల్పులు ఓపెన్ చేస్తారు. ఈ కాల్పుల్లో ఎటులేదన్నా 30 మంది వరకు టీడీపీ కార్యకర్తలు మరణిస్తారు. దీంతో దేశం మొత్తం పుంగనూరు వైపు చూస్తుందని, దీంతో ప్రభుత్వాన్ని కూల్చేసి, సానుభూతి పేరిట చంద్రబాబు నాయుడును సీఎం కుర్చీ ఎక్కించవచ్చనే భారీ పన్నాగం పన్నారు.

ఇలాంటి వ్యక్తికి టికెట్టా?

స్వార్థ రాజకీయాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాటే చల్లా రామచంద్రారెడ్డికి టీడీపీ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంపై పుంగనూరు వాసులు మండిపడుతున్నారు. ఇలాంటి ఆలోచనా విధానమున్న వ్యక్తిని రాజకీయాల్లో ప్రోత్సహించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్లాన్- బీ..

ప్లాన్- ఏ అమలుకాని పక్షంలో ప్లాన్-బీకి సైతం పచ్చ పార్టీ నేతలు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

పోలీస్ ప్లాన్ ఇలా..

టీడీపీ నేతలు రూపొందించిన మారణహోమం ఉచ్చులో పోలీసులు చిక్కుకునే ఘటన దాదాపు అమలైపోతుందని ఆ పార్టీ నేతలు భావించారు. దీనికి తోడు అల్లర్ల సమయంలో అక్కడ బందోబస్తులో ఉన్న ఓ పోలీసు అధికారి వెంటనే అప్పటి ఎస్పీ రిషాంత్‌రెడ్డికి ఫోన్ చేశారు. పోలీసులు రక్తమోడుతుండడం చూసిన ఆ అధికారి చలించిపోయి. గద్గద స్వరంలో ఎస్పీతో మాట్లాడుతూ.. 'సర్, పరిస్థితి చేయి దాటిపోతోంది. డీఎస్పీల తలలు పగిలిపోతున్నాయి. సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు ఇక్కడ ఆర్తనాదాలు చేస్తున్నారు. మనం ఫైర్ ఓపెన్ చేయాలి. వెంటనే మీరు కలెక్టర్‌తో మాట్లాడి ఫైరింగ్‌కు ఆర్డర్ ఇవ్వండి ప్లీజ్. లేకుంటే మన వాళ్లు చనిపోతారు..' అంటూ బతిమిలాడారు. అక్కడ ఏం జరుగుతోందని ఎస్పీ ఆరా తీశారు. సంయమనంతో ఆలోచించి పోలీసులు 300 మీటర్లు వెనక్కు వచ్చేయాలని ఆదేశించారు. దీంతో టీడీపీ శ్రేణులు రాళ్లు, మద్యం బాటిళ్లు నిల్వ ఉన్న ప్రాంతం నుంచి దూరమవుతారని చెప్పారు. ఇదే జరిగితే పోలీసులకు దగ్గరగా వచ్చిన టీడీపీ శ్రేణులను చెదరగొట్టడానికి స్వల్ప లాఠీచార్జ్, బాష్ప వాయు ప్రయోగించాలని సూచించారు. తాను కూడా వెంటనే పుంగనూరు వచ్చేస్తానని, అప్పటి వరకు ఒక్క బుల్లెట్ కూడా తుపాకీ నుంచి బయటకు రావడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఎస్పీ ఆదేశాలను అమలు చేసిన పోలీసులు, అనుకున్నట్లుగానే రక్తం కారుతున్నా, అల్లరి మూకల్ని దగ్గరకు రప్పించి లాఠీలతో చెదరగొట్టారు. దీంతో టీడీపీ నేతల కుతంత్రాలు, కుట్రలు పటాపంచలైపోయాయి.

పోలీసులు చనిపోకపోయినా, ఫైర్ ఓపెన్ చేయకపోయినా ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు మొత్తం ఒక్కసారిగా పుంగనూరు పట్టణంలోకి చొరబడాలి. ఎక్కడికక్కడ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫ్లెక్సీలు చింపడం, పెట్రోలు పోసి నిప్పంటించడం చేయాలి. దీనిపై వెంటనే వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రతిస్పందిస్తాయి. ఈ క్రమంలో చెలరేగే అల్లర్లలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఒకరిద్దరిని మట్టుబెడితే.. వాళ్ల చేసే దాడుల్లో టీడీపీ కార్యకర్తలు సైతం చనిపోతారు. ఇది జరిగినా కూడా నెపం ప్రభుత్వంపై నెట్టేసి, శవ రాజకీయంతో సర్కారును పడగొట్టవచ్చని రెండో ప్లాన్‌ను సిద్ధం చేసుకున్నారు. రాష్ట్రం మొత్తం ఈ ఘటనలతో హోరెత్తిపోతుందని, అదే కారణంగా శాంతి భద్రతల వైఫల్యాన్ని ఎండగట్టాలని అనుకున్నారు. అయితే ఈ రెండు ప్లాన్ల గురించి టీడీపీలోని ప్రధాన వ్యక్తులకు తప్ప, పార్టీ కార్యకర్తల్లో ఒక్కరికి కూడా తెలియడానికి వీల్లేదంటూ కట్టడి చేశారు. ఎక్కడా కూడా ఈ ప్లాన్ల గురించి ఎవరూ మాట్లాడకుండా అత్యంత గోప్యత పాటించారు. ఈ అల్లర్లకు పుంగనూరు నుంచి కాకుండా మదనపల్లె, ములకలచెరువు, సదుం, సోమల మండలాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలను రంగంలోకి దించాలని ఆదేశించారు.



పుంగనూరులో చల్లా గ్యాంగ్ చేతిలో దగ్ధమవుతున్న పోలీస్ వాహనాలు (ఫైల్)

'చల్లా' చరిత్ర నేరమయమే!



టీడీపీ పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి అలియాస్ చల్లా బాబు చరిత్రంతా నేరమయమే. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఇతనిపై దాడులు, హత్యాయత్నాలు చీటింగ్ తదితర నేరాలపై పోలీసులు 19 కేసులు నమోదు చేశారు. ఇందులో గత ఏడాది ఆగస్టు 4న పుంగనూరులో జరిగిన అల్లర్ల కేసులో ప్రధాన నిందితుడుగా 7 కేసులు నమోదయ్యాయి. అలాగే సోమల, కల్లూరు, రొంపిచెర్ల, చౌడేపల్లె, ములకలచెరువు, ముదివేడు పోలీస్‌స్టేషన్లతో పాటు తెలంగాణలోని కూకటిపల్లె పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నట్లు చల్లారామచంద్రారెడ్డి స్వయంగా తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

– చల్లా రామచంద్రారెడ్డి, టీడీడీ ఎమ్మెల్యే అభ్యర్థి, పుంగనూరు

రెచ్చిపోయిన పచ్చమూక

టీడీపీ శ్రేణుల రౌడీయిజం రోజురోజుకూ పెచ్చుమీరిపోతోంది. యథేచ్ఛగా దౌర్జన్యాలకు తెగబడుతోంది. బెదిరింపులతో వైఎస్సార్‌సీపీ నేతలను భయపెట్టాలని యత్నిస్తోంది. ఎన్నికల ప్రచారం సైతం సజావుగా సాగకుండా అడ్డుకునేందుకు పన్నాగాలు పన్నుతోంది. చివరకు పోలీసుల పహరాలో ఓట్లు అభ్యర్థించునే పరిస్థితిని కల్పిస్తోంది.

- వేపనపల్లెలో వైఎస్సార్‌సీపీ నేతలను అడ్డుకునేందుకు యత్నం
- అసభ్యపదజాలంతో దూషిస్తూ బెదిరింపులు
- పోలీసుల రంగప్రవేశంతో ముందుకుసాగిన ప్రచారం

కాణిపాకం: పూతలపట్టు మండలం వేపనపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేతలపై సోమవారం టీడీపీ నాయకులు దౌర్జన్యానికి దిగారు. ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్‌కు వస్తున్న ప్రజాదరణను ఓర్వలేక నానా రాద్ధాంతం సృష్టించారు. బడా నాయకుల డైరెక్షన్‌లో గొడవకు యత్నించారు. తమ ఊర్లో వైఎస్సార్‌సీపీ ప్రచారం జరగకూడదని, ఓట్లు అడిగేందుకు వీలులేదంటూ రెచ్చిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు అధిక సంఖ్యలో గ్రామానికి చేరుకున్నారు. పక్క గ్రామంలో పర్యటిస్తున్న సునీల్‌కుమార్ వద్దకు వెళ్లి వేపనపల్లెలో ప్రచారం వాయిదా వేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రచారం చేసుకోవడం తన హక్కని ఆయన స్పష్టం చేయడంతో చేసేది లేక భద్రత కల్పించారు. డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ సుదర్శన ప్రసాద్, విశ్వనాథరెడ్డి అక్కడి చేరుకుని పటిష్ట బందోబస్తుతో వేపనపల్లెలో ప్రచారం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో ఉదయం 10.45 గంటలకు వేపనపల్లె గ్రామానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ తదతరులు చేరుకున్నారు. ఇంతలో అక్కడ గుమికూడిన టీడీపీ శ్రేణులు ఒక్కసారిగా వైఎస్సార్‌సీపీ నేతలపైకి దూసుకొచ్చారు. పచ్చిబూతులతో దూషించారు. పోలీసుల సమక్షంలోనే ఊర్లో అడుగుపెడితే నరికేస్తామంటూ బెదిరించారు. వీరికి జనసేన కార్యకర్తలు సైతం వంతపాడారు. మొత్తం వ్యవహారం గమనించిన పోలీసులు రంగ ప్రవేశం చేశారు. పచ్చమూకకు గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ఎన్నికల నియమావళి మేరకు అభ్యర్థుల ప్రచారం అడ్డుకుంటే కేసులు తప్పవని హెచ్చరించారు. ఎట్టకేలకు పోలీసుల పహరా నడుమ సునీల్‌కుమార్ గ్రామంలో ప్రచారం సాగించారు. అయినప్పటికీ పచ్చబ్యాచ్ నినాదాలు చేస్తూ.. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. పోలీసులను సైతం లెక్క చేయకుండా గొడవకు కాలుదువ్వారు. అయితే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రచారాన్ని ప్రశాంతంగా ముగించారు. కాగా, ఆరు నెలలకు క్రితం ఆ గ్రామంలో నిర్వహించిన గడపగడప కార్యక్రమంలో గొడవ చోటుచేసుకుంది. అప్పుడు కూడా కొందరు ఇలానే ప్రవర్తించారు. అప్పుడు ఆరుగురిపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కక్షతోనే ఇప్పుడు మళ్లీ గొడవ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్



టీడీపీ కార్యకర్తలను కట్టడి చేస్తున్న పోలీసులు



రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న పచ్చ బ్యాచ్

ప్రజాస్వామ్య విరుద్ధం

వేపనపల్లెగ్రామంలో జనసేన, టీడీపీ కార్యకర్తలు, నాయకులు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరించారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ మండిపడ్డారు. ఎన్నికల ప్రచారం తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రాళ్ల దాడి చేసినప్పుడే ఓపికతో వ్యవహరించామన్నారు. ప్రశాంతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించుకుంటుంటే అడ్డగించడం కరెక్ట్ కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో ముందుకు వెళుతున్నామని వెల్లడించారు.

పార్లమెంట్‌కు 19.. అసెంబ్లీకి 78 మంది పోటీ

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల సమరంలో పోటీ పడే అభ్యర్థులెవరో ఖరారైంది. సోమవారం నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసింది. జిల్లాలోని చిత్తూరు పార్లమెంట్, 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీలో ఉండే అభ్యర్థుల వివరాలను అధికారులు ప్రకటించారు.చిత్తూరు ఎంపీ స్థానానికి 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ప్రకటించారు. అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి 78 మంది అభ్యర్థులు పోటీలో మిగిలినట్లు వెల్లడించారు. పోటీ ఖరారు కావడంతో అభ్యర్థులు తమ ప్రచారాన్ని మరింత ఉధృతం చేస్తున్నారు.

నియోజకవర్గం	బరిలో ఉన్న వారు
చిత్తూరు పార్లమెంట్	19
పుంగనూరు	08
నగరి	07
జీడీ నెల్లూరు	11
చిత్తూరు	13
పూతలపట్టు	12
పలమనేరు	14
కుప్పం	13
మొత్తం	97

క్లుప్తంగా

గుట్టుగా నగదు పంపిణీకి టీడీపీ సన్నాహాలు!

– ఆన్‌లైన్ ద్వారా నేతల ఖాతాల్లో జమ

పలమనేరు : ఎన్నికల్లో నగదు పంపిణీని అడ్డుకునేందుకు ఎలక్షన్ కమిషన్ పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఎక్కడికక్కడు చెక్‌పోస్టులు పెట్టి తనిఖీలు నిర్వహిస్తోంది. ప్రత్యేక బృందాలతో కట్టుదిట్టంగా నిఘా పెడుతోంది. రూ.50వేలకు మించి తీసుకెళ్లే వారు సరైన ఆధారాలు చూపించకుంటే నగదును సీజ్ చేయిస్తోంది. అయితే టీడీపీ నేతలు మాత్రం టెక్నాలజీ సాయంతో ప్రలోభాల పర్వానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ముఖ్యంగా పలమనేరు నియోజకవర్గంలో పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే యాప్‌ల ద్వారా ఇప్పటికే నమ్మకస్తులైన మండలస్థాయి ముఖ్యనేతల ఖాతాల్లోకి నగదు జమ చేసేసినట్టు సమాచారం. ఆన్‌లైన్ ద్వారా ఫోన్ నుంచి రోజూ రూ.99వేల వరకు జమ చేయవచ్చు. ఇదే ఆధారంగా తీసుకుని రోజూ సుమారు 50 మంది ఖాతాల్లోకి దాదాపు రూ.50లక్షల వరకు నగదు చేర్చేస్తోంది. ఆ మేరకు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సుమారు 250 మంది నేతలకు నగదు అందజేసినట్లు తెలిసింది. ప్రలోభాలు, పంపకాలకు సైతం ప్రత్యేకంగా సెక్షన్ ఇన్‌చార్జిలను నియమించుకుని వారితో సమావేశం సైతం నిర్వహించినట్లు సమాచారం. ఇక్కడి టీడీపీ నాయకుల ఖాతాలకు చేరుతున్న నగదు హైదరాబాద్ నుంచి ఎక్కువగా వస్తున్నట్టు తెలుస్తోంది.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రామకుప్పం: మండలంలోని విజలాపురం సంతమిట్ట క్రాస్ వద్ద కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.5లక్షల మద్యం, రెండు బైక్‌లు, ఓ కారు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ శ్రీనాథ్ కథనం మేరకు.. ఎస్ఐ శివకుమార్ వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా కర్ణాటక మద్యం పట్టుబడింది. ఎస్.కొత్తపల్లెకు చెందిన వరప్రసాద్, పైపాళ్యానికి చెందిన శ్యామరాజు, వారిక సహకరించిన రాజుపేటరోడ్డు వేణు బార్ అండ్ రెస్టారెంట్ మేనేజర్ నితీష్ కుమార్ గౌడను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో సిబ్బంది హరి, మురుగేష్, మంజునాథ్ రెడ్డి, వరప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్నతోనే నవరత్న వెలుగులు

- వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు
- కండువాలు కప్పి ఆహ్వానించిన అభ్యర్థులు, నేతలు



పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ నేత నాగరాజా



మంత్రి రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు, మహిళలు

పుత్తూరు: ప్రజల జీవితాల్లో నవరత్న వెలుగులు నింపడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, ఐదేళ్ల సుపరిపాలనలో నిత్యం పేదల అభ్యున్నతికే కృషి చేశారని మంత్రి, నగరి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా తెలిపారు. సోమవారం పట్టణంలోని 4, 6 వార్డులకు చెందిన టీడీపీ నాయకులు జగదీష్, సురేష్, రాధా, సులోచన, నిర్మల, నాగమ్మ, భారతి, పవిత్ర, కల్పన, లక్ష్మీ, పార్వతి, రమ్య, కుమారి, ఎల్లమ్మ, అనూష, కవిత, జయ, నిత్య, దేవయాని, అమ్ములుతో పాటు 150 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్, ప్రవీణ్, చైతన్య, తులసిరెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి రోజా అందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి రోజా మాట్లాడుతూ జగనన్న మహిళలకు సముచిత స్థానం కల్పించారని తెలిపారు. ప్రతి పథకాన్ని మహిళల పేరిట అమలు చేస్తున్నారని చెప్పారు.

పలమనేరు : పట్టణంలోని జగనన్న లేఅవుట్, ఏటిగడ్డ గ్రామాలకు చెందిన వంద కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్ కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, పట్టణ కన్వీనర్ జాఫర్, మాజీ కన్వీనర్ మండీ సుధా, కౌన్సిలర్లు రాజేష్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో..

పుంగనూరు : మంత్రి, వైఎస్సార్‌సీపీ పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో సోమవారం పట్టణంలోని సాయిబాబా ఆలయ ధర్మకర్త, టీడీపీ నేత నాగరాజాపార్టీలో చేరారు. రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిలర్ ముత్తంశెట్టి విశ్వనాథ్ , మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, బలిజ సంఘ నాయకుడు రాయల జగదీష్, కౌన్సిలర్ రెడ్డెమ్మ, నాయకులు ఎస్వీటీ సోము, కిషోర్ పాల్గొన్నారు.

30 మంది యువత

పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నేతలు ప్రభు, రమణ, సలీం ఆధ్వర్యంలో 30 మంది యువకులు మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో చేరారు. వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, కౌన్సిలర్ సుప్రి య, మక్కా కమిటీ డైరెక్టర్ ఖాదర్ పాల్గొన్నారు.

బంగారుపాళెంలో 60 కుటుంబాలు

బంగారుపాళెం: టీడీపీ నేతలు బలవంతంగా పచ్చ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారని మండలంలోని కొరివారిపల్లె, కల్లూరుపల్లె ఆదిఆంధ్రవాడ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నుంచి సోమవారం సుమారు 60 కుటుంబాల వారు తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి వారికి కండువాలు కప్పి పార్టీ ఆహ్వానించారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పూతలపట్టు : పార్టీలో చేరిన కొరివారిపల్లె గ్రామస్తులు



ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ సమక్షంలో పార్టీలో చేరిన వంద కుటుంబాలు

అకౌంట్‌కే నేరుగా పింఛన్

- జిల్లాలో 2,72,864 మందికి రూ.79.87 కోట్ల పంపిణీకి చర్యలు
- బ్యాంకు ఖాతా లేని వారి ఇంటికే నగదు



కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పింఛన్‌దారుల అకౌంట్‌లకు నేరుగా మే 1వ తేదీన (డీబీటీ) విధానంలో నగదు జమ చేయనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో లింక్ అయిన వారికి డీబీటీ విధానంలో పింఛన్ నగదు జమవుతుందన్నారు. సచివాలయల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని వెల్లడించారు. బ్యాంకు ఖాతాలు లేని వారు, ఆధార్‌తో లింక్ కాని వారికి సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దకొచ్చి పింఛన్ పంపిణీ చేస్తారని వివరించారు. పింఛన్ల పంపిణీ పర్యవేక్షణకు మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా మొత్తం 2,72,864 మందికి రూ.79.87 కోట్ల నగదును పింఛన్ల కింద పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. జిలాల్లలో 1,92,021 మంది లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు ఆధార్‌లింక్ అయిందన్నారు. మిగిలిన 80,843 మంది ఇళ్లకు వెళ్లి సచివాలయ సిబ్బంది నగదు అందిస్తారని తెలిపారు. మొత్తం డీబీటీ విధానంలో రూ.57.60 కోట్లు, నాన్ డీబీటీ కింద 22.26 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వివవరించారు.

ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, అత్యవసర శాఖల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. జిల్లాలో 16,547 మంది పోస్టల్ బ్యాలెట్ కు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఇందులో 4,633 మంది బయట జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగులున్నారని తెలిపారు. మే 5 వ తేదీన పోస్టల్‌బ్యాలెట్ లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మే 2వ తేదీ తర్వాత ఓటర్లకు స్లిప్పుల పంపిణీ ఉంటుందని వివరించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ తులసి పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో నిందితుడికి జైలు

చిత్తూరు అర్బన్: చీటీల పేరిట మోసం చేసి, పలువురి నుంచి అనధికారికంగా డిపాజిట్లు సేకరించిన జి.ఆంజనేయులు అలియాస్ సాయినాద్ చౌదరి (47)అనే నిందితుడికి 9 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ చిత్తూరు జిల్లా న్యాయస్థానం సోమవారం తీర్పునిచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పులికల్లు రవీంద్రనాథ్‌రెడ్డి కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన ఆంజనేయులు 5 ఏళ్ల క్రితం బంగారుపాళానికి వచ్చాడు. అక్కడ ఓంశక్తి ఆలయం ఏర్పాటు చేశాడు. చుట్టుపక్కలున్న మహిళలందరినీ గుడికి రప్పించి.. తాను చీటీలు వేస్తున్నాని చెప్పి నమ్మించాడు. తొలుత రూ.10 వేలు, రూ.50 వేలు చీటీలు వేసి అందరికీ డబ్బులు సక్రమంగా ఇచ్చేసేవాడు. కొద్ది రోజుల తర్వాత ప్రజల్లో నమ్మకం పెంచుకుని రూ.10 లక్షలు, రూ.5 లక్షలు, రూ.2 లక్షల చీటీలు వేయడం ప్రారంభించాడు. పెద్ద సంఖ్యలో మహిళలు అతడి వద్ద చీటీలు వేశారు. పైగా చేబదులుకు కొద్దిగా డబ్బులు ఇవ్వాలని పలువురి నుంచి అప్పులు కూడా తీసుకున్నాడు. చీటీలు పాడుకున్నవాళ్ల నగదు తన వద్ద డిపాజిట్ చేస్తే అధిక వడ్డీలు ఇస్తామని నమ్మించాడు. ఇలా 64 మంది బాధితుల వద్ద రూ.2.84 కోట్ల చొప్పున చీటీ డబ్బులు, రూ.3.60 కోట్లు చేబదులుకు తీసుకున్నాడు. దాదాపు రూ.6.44 కోట్లు మోసం చేసి, 2022 ఫిబ్రవరిలో పరారయ్యాడు. దీనిపై బంగారుపాళానికి చెందిన నీలమ్మ అనే బాధితురాలు తొలుత పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను చీటీ డబ్బుల రూపంలో రూ.35 లక్షలు, చేతికి మరో రూ.45 లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేయగా, మరో 63 మందిని సైతం ఆంజనేయులు మోసం చేసినట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు, కోర్టుకు తరలించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలన్న ప్రాసిక్యూషన్ వాదనతో ఏకీభవించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమ్‌రావు.. నిందితుడు ఆంజనేయులుకు 9 ఏళ్ల జైలుశిక్ష, రూ.1.55 లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

21,22 తేదీల్లో చిత్తూరు జాతర

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు గంగజాతరకు నిబంధనలతో కూడిన అనుమతి ఇచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మే 14వ తేదీన గంగజాతర చాటింపు, మే 21,22 తేదీల్లో నిబంధనలతో జాతర నిర్వహణకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆయన పేర్కొన్నారు.

పేదలకు మేలు చేసేలా మేనిఫెస్టో



ఆవలకొండ మసీదులో డిప్యూటీ సీఎం నారాయణస్వామిని సత్కరిస్తున్న ముస్లింలు



పార్టీలో చేరిన యువతతో ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

గంగాధర నెల్లూరు : పేదలకు మేలు చేసేలా వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. సోమవారం మండలంలోని తూగుండ్రం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ స్థానిక నేతలు లోకనాథం, జేసీఎస్ కన్వీనర్ రాజేంద్ర ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మేనిఫెస్టోను జగనన్న ఖురాన్, భగవద్గీత, బైబిల్‌లా పవిత్రంగా భావించి తూచా తప్పకుండా అమలు చేస్తారన్నారు. చంద్రబాబు తన మేనిఫెస్టోని ఎన్నికల తర్వాత ఎవరికీ కనిపించకుండా మాయం చేస్తారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలు,, ఎస్సీ ఎస్టీలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని తెలిపారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందని కొనియాడారు. ప్రజా ప్రభుత్వంపై బురద జల్లడానికి ప్రతిపక్షాలు ఏకమై నానా ప్రయత్నాలు చేస్తున్నాయిన మండిపడ్డారు. చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, టీడీపీ నేతలకు దళితులంటే చిన్నచూపని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగితే ఓర్వలేరని ఆరోపించారు. ఇటీవల నారా భువనేశ్వరి దళిత నాయకులను అసభ్య పదజాలంతో దూషించారని, గతంలో కూడా చింతమనేని ప్రభాకర్ దళిత ఎంఆర్‌ఓ వనజాక్షిపై దాడి చేశారని వివరించారు. జగనన్న ప్రభుత్వంలో దళితులకు పెద్దపీట వేశారని, అన్ని రంగాల్లో ప్రోత్సహించి పైకి తీసుకువచ్చారని తెలిపారు. కూటమికి ఓటేస్తే ముస్లిం మైనారిటీలకురిజర్వేషన్లు కూడా తీసేస్తామని బహిరంగంగానే చెబుతున్నారని, ముస్లిం సోదరులు ప్రతి ఒక్కరూ ఆలోచించాలని సూచించారు. జీవితాంతం ప్రజాసేవలోనే ఉన్నానని, ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన కుమార్తె కృపాలక్ష్మిని, చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను ఆశీర్వదించి, అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, రాష్ట్ర గ్రీనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, జిల్లా రైతు అధ్యక్షుడు వెంకటరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు వేల్కూరు బాబురెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరక నెల్లూరు కోదండస్, వైస్ ఎంపీపీ హరిబాబు, నేతలు ముని రాజారెడ్డి, తూగుండ్రం సర్పంచ్ శ్రీ బాబు, ఎంపీటీసీ సభ్యులు వాణిశ్రీ, నాయకులు ప్రభాకర్ రెడ్డి, చిట్టిబాబు, మోహన్ రెడ్డి, జాన్ సుందరం, ఆదికేశవ రెడ్డి, ఆవల కొండ, ఫయాజ్ అలీ, ఇష్తికార్ అలీ, అల్తాఫ్, అహ్మద్ పాల్గొన్నారు.

మా ఆత్మ సాక్షిగా ఓటేస్తాం

వెదురుకుప్పం : ''మేం డబ్బుకి అమ్ముడుపోం.. మా ఆత్మసాక్షిగా ఓటేస్తాం'' అని మండలంలోని మాంబేడు పంచాయతీ ధర్మాచెరువు వాసులు ముక్తకంఠంతో డిప్యూటీ నారాయణ స్వామి ఎదుట ప్రతిజ్ఞ చేశారు. గతంలో వారు టీడీపీలో చేరినట్లు ఎల్లో మీడియాలో ప్రచారం చేయడంపై స్పందించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎంతో వారు మాట్లాడారు. టీడీపీ అభ్యర్థి థామస్ ప్రలోభపెట్టి కొందరికి టీడీపీ కండువా కప్పారని, వారు సైతం ఆత్మ పరిశీలన చేసుకుని వైఎస్సార్‌సీపీలోకి వచ్చేశారని వెల్లడించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ జగనన్నలా దేశ చరిత్రలో ఎవరైనా పేదల అభ్యున్నతికి ఇంతలా తాపత్రయపడ్డారా అని ప్రశ్నించారు. జగనన్న మళ్లీ సీఎం అయితే పేదరికాన్ని పూర్తిగా నిర్మూలిస్తారని భరోసా ఇచ్చారు. సమష్టిగా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గ్రామీణాభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే మండలంలోని దేవరగుడిపల్లెకు చెందిన కొందరు యువకులు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి సమక్షంలో పార్టీలో చేరారు.

జగనన్న పాలనలో ఇంటింటికీ సంక్షేమం



మిట్టపాళెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి రోజా

నగరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందాయని మంత్రి, నగరి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా తెలిపారు. సోమవారం మండలంలోని మిట్టపాళెం, చిన్నతాంగెళ్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు అడుగడుగునా మంత్రి రోజాకు అపూర్వ స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటామని స్పష్టం చేశారు.ఒకే ప్రాంగణంలో రూ.కోటి వ్యయంతో సచివాలయం, ఆర్బీకే కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, కమ్యూనిటీ టాయిలెట్లు నిర్మించారని, సిమెంటు రోడ్లు వేశారని, బోరు వేసి తాగు నీరు అందించారని, రూ.16 లక్షల వ్యయంతో శిథిలావస్థలో ఉన్న తమ ఊరి పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో మార్చారని ఆనందం వ్యక్తం చేశారు. ఇదివరలో పిల్లలు చెట్ల కింద కూర్చొని పాఠాలు చదివే పరిస్థితి ఉండేదని ప్రస్తుతం తరగతి గదిలో అధునాతన డెస్కులపై కూర్చుని చదువుకుంటున్నారని వివరించారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటినీ వెతుక్కుంటూ వస్తున్నాయని, మంచి చేసిన ప్రభుత్వం వైపే తాముంటామని తెలిపారు. మంత్రి రోజా మాట్లాడుతూ ఇంట్లో ఫ్యాను బటన్ వేస్తే అది తిరుగుతూ చల్లని గాలిని ఇస్తుందని ఎన్నికల బూత్‌లో ఫ్యాన్ బటన్ నొక్కితే ప్రతి సంక్షేమ పథకం మీ ఇంటి చుట్టూ తిరుగుతుందన్నారు. పొరపాటున సైకిల్ బటన్ నొక్కేస్తే పథకాలను వెతుక్కుని మీరు తిరగాల్సిందే హెచ్చరించారు. ప్రజలు ఆలోచించి స్పష్టతతో ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, సర్పంచ్‌లు పరంధామన్, జయరామ్, డింపుల్, ప్రకాష్, రవికుమార్, మోహన్, ఎంపీటీసీ సభ్యుడు ఏసు, పార్టీ మండల కన్వీనర్ సుదర్శనం నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ హరి, నాయకులు ధనపాల్‌రెడ్డి, నాగవేలు రెడ్డి, పయని, రామకృష్ణ, వినోద్‌కుమార్, మోహన్, సోమనాథ్, దక్షిణామూర్తి పాల్గొన్నారు.